అయితే మీకు త్యాగరాజ కీర్తనలు యిష్టవా? రామదాసు కీర్తనలు యిష్టవా? భక్తిరంజని వింటారా? వివిధ భారతి వింటారా?

ఇంతకీ మీ ఓటు రాముడికా కృష్ణుడికా -

# ఐ డోంట్నో

పెళ్ళాం చచ్చిపోతే.

అసలు చావగానే ఆడదాని చాప్టర్ క్లోజ్; మహా అయితే ఒక ఎన్లార్జిమెంటు తీయించి దానికో చెమ్కీ పూలదండవేసి. మెయిన్‌గేటు గుమ్మంమీద వేలాడకట్టారు. ఇంట్లోకి రాగానే రెండో పెళ్ళి పెళ్ళాం ఆ బొమ్మను చూసి జడుసుకుని చావడానికి.

పెళ్ళాం పోగానే - మంచాలు ఎండలో పడేసి నవారు చాకల్దాని కేస్తారు. పరుపులు చింపేసి, దూది ఏకించి మళ్లీక్రొత్త దిళ్ళూ, క్రొత్త పరుపులూ కుట్టించుకుంటారు.

దాని నగలేమన్నావుంటే- పిల్లలుంటే బ్యాంకులలో వేస్తారు. ఆడపిల్లలుంటే వాళ్ళకోసం అట్టేపెడతారు. లేకపోతే - చెరిపించి క్రొత్త పెళ్ళానికి క్రొంగొత్త నగలు చేయిస్తారు.

దానిచీరలు నలుగురూ కట్టుకుని చింపిప్రోగులెడతారు.

ఒకప్పుడు కొంగు కొంగు ముడివేసుకుని గడప దగ్గర పేర్లు చెప్పి తలవంచుకొని ముసిముసి నవ్వులు నవ్వుతూ ఇంట్లోకి వచ్చిన దీపం లాంటి పడుచుపిల్ల - గుటుక్కు మనగానే స్మృతిపథంలోంచి క్రమక్రమంగా తుడిచి పెట్టుకుపోతుంది.

ప్రేమ అనేదిలేదు అది సర్వాబద్ధమని ప్రతి మగవాడూ ఎప్పుడో ఒకప్పుడు ఋజువుచేస్తాడు. చచ్చి పోయిన పెళ్ళాన్ని తలచుకుంటూ జీవితాంతం ఏడుస్తూ కూర్చోడు ఏమొగాడూ, కాని షాజహాన్ అలా ఏడ్చాడు.

ఆ రసికసామ్రాట్టు దుఃఖం మంచువలె తెల్లనై ఘనీభవించిన చోటు - అశ్రువుల ప్రతిబింబం తాజ్ మహల్

కాలం చెక్కిలిపై పడిన కన్నీటిచుక్క అన్నాడు టాగూర్ -

అంటే అన్నాడు కానీ - ప్రతి పెళ్ళయిన ఆడపడుచు హృదయం లోనూ ఒక తాజ్‌మహల్- తాజ్‌మహల్ కోటిదీప్తులతో ప్రకాశిస్తూ వుంటుంది.

అయితే ఆ మందిర కవాటాల్ను తెరిపించే "కీ" ఈ కట్నాలూ ఆడపడుచు లాంఛనాలు వగైరాలు స్వీకరించి తాళికట్టిన పెద్దల చాటు మొగుళ్ళకు లభించదు.

ఆ ప్రేమ పొందినవాడు ధన్యుడు

నా కనిపిస్తుంది - ఆ అమృతపు జల్లులో తడిసినవారి కోసమే కవులు పాటలల్లారు - గాయకులు పాడారు. సుందరీమణులు నాట్యమాడారు.

"ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధమ్ములో - నిదురించు జహాపనా" ఈ పాట నా కెంతో యిష్టం; రామారావుగారు ఎంతబాగా పాడారు?

ఈ రోజు మొదటిసారి తాజ్‌మహల్‌ను చూడగానే ఈ పాటే ఈ గొంతుకే నా మనస్సులో మార్మోగింది.

వెంటనే మరో గేయంకూడా స్ఫురించింది.

"మామిడిచెట్టును అల్లుకున్నదీ
మాధవీ లతొకటి
ఏమా రెండిటి ప్రేమ సంపదా
ఇంతింతన లేమూ-"

భార్యా వియోగంవలన అంతటి లోకాతీతమైన దుఃఖం కలగబట్టే అది తాజ్‌మహల్ రూపంలో గడ్డకట్టింది.

లోకంలో యింతకంటె భార్యా వియోగదుఃఖాన్ని అనుభవించిన వారులేరా? - వుంటే వుండొచ్చు;

ఒక అపురూప సౌందర్యరాశికి అసాధారణమైన స్మృతి చిహ్నం;

కాని అక్కడకు వచ్చినవాళ్ళు కూడా ఆశోక విహ్వలతను, ఆ బాధను ఆ వియోగ మాధుర్యాన్ని గుర్తించినట్లు కనుపించరు.

జోళ్ళు ఎవళ్లైనా ఎత్తుకుపోతారేమోనని భయపడేవాళ్ళూ -

పిల్లల్ని ఒంటికి కూచ్చోపెట్టేవాళ్లూ టిఫిన్లుతిని పొట్లాలూ ఆకులూ ఆ ఆవరణలో పడేసి గలీజు చేసేవాళ్ళూ అక్కడ కూర్చుని ఫోటోలు తీయించుకునేవాళ్ళూ వీళ్ళే ఎక్కువమంది కనిపించారు.

ఆ తాజ్‌మహలు ఆవరణంలో చాటుగా తీసికెళ్ళి ఒక పంజాబీ అమ్మాయిని ఒక అబ్బాయి ముద్దుపెట్టుకున్నాడు మీనార్ చాటున. అది చూచి నేను నవ్వుకున్నాను.

ఆ తాజ్‌మహల్ లోపల ఆబోడి గోడలు తెల్లగా ఒరిగిపోయిన ఒంటెల్లా - ఆ క్రిందనుంచి నడుస్తూంటే చెడ్డనిరాశ కమ్ముకొచ్చింది. గుండె గుబగుబలాడేనూ - ఎండి గుటకదదాయేనూ అనిపించింది.

చాలా దూరంగా వెళ్ళి ఓ చెట్టు క్రింద నిలబడి తనివితీరా చూశాను

"మనసున మల్లెలమాల లూగెనే
తలపున వెన్నెల డోలలూగెనే"

షాజహానుకి తన భార్యపైగల అనురక్తి గొప్పదే కావచ్చు:

అంత మాత్రాన యింత బిల్డింగు కట్టించేస్తాడా - అద్దెకొంపలలో జీవనయాత్ర సాగించే అధమాధములు ఎంత పెళ్ళాన్ని ప్రేమించినా ఏం కట్టిస్తారు?

నేను చచ్చిపోతే -

ఎన్లార్జిమెంటు తీయించి దానికో చమ్కీదండ రెండు రూపాయలన్నరది వేసి అద్దెకొంప గుమ్మంమీద వ్రేలాడతీస్తారు.

నాకేడుపొచ్చేసింది.

ఎర్రగా కళ్ళు వాచిపోయేలా ఏడ్చేశాను.

ఏవండీ యిలా తాజ్‌మహల్ కట్టలేని వాళ్లంతా పెళ్లాల్ని ప్రేమించని వాళ్ళేనా -

డోంటాక్ రాట్ అని మావారన్నారూ....

ఏటా పెళ్ళాం చచ్చిపోయిన రోజున గారెలూ, అరిసెలూ పరవాన్నమూ ఒండుకు తినడంలేదా?

అది మాత్రం స్మృత్యంజలి కాదా ఏవిటి అని. అప్పుడు ఏవండీ ఒక వేళ నేనే ముందుపోతే... అన్నాను.

చెంప ఛెళ్ళుమనేలా వాయించారు

అదేమిటండీ యిక్కడ అందరూ వెన్నెల రాత్రులు వచ్చి పెళ్లాలతో సరదాగా వుంటారు. మీరు తాజ్‌మహల్ వద్ద పెళ్ళానికి లెంపకాయ కొడ్తారూ అని గింజుకున్నా.

అదీకాదే - ఇడియట్.

బుష్ షర్ట్ బొత్తాములు కుట్టాలి;

జోళ్ళు పాలిష్ చేయాలి;

బియ్యపు పిండి మొరుం పట్టించాలన్నావు;

ఇంటికెళ్లాక బొబ్బట్లు - పులిహోర చేస్తానన్నావు?

టైలరుదగ్గర ఏ వేం బట్టలుండిపోయాయో....

చాకలి పద్దు చూడద్దూ -

దుప్పట్లు దిండుగలేబులు ఉతకాలన్నావ్,

పనిమనిషికీ అడ్వాన్సిచ్చావ్ -

ఇవన్నీ ఎవరు -

నా తాత వచ్చి చేస్తాడనుకున్నావా,

పదపద అంటూ చేయిపుచ్చుకులాగారు

అలా లాక్కండీ -

పాలరాతి గచ్చుమీద పడిపోగల్ను -

అలా తోస్తారేవిటి -

మంచీ మర్యాదా లేకుండా....

తాజ్‌మహలు కొచ్చాంకదా;

కాసేపు జంటిల్మన్‌లా వుండలేరూ?

అంతలో ఏ మొచ్చిందో -
అన్నీ అపస్వరాలొలికిస్తూ
ఈ విశాల ప్రశాంత
ఏకాంత సౌధమ్ములో
నిదురించు జహాపనా-
అని వెక్కిరిస్తూ పాడారు.

నాకు వెర్రికోపం వచ్చేసింది. వెనకనుంచి వెళ్ళి చిన్నతోపు తోశాను. తాజ్‌మహల్ గచ్చు మీద పాట ఆపి పడబోయి తమాయించుకుని "ఏం ఒళ్లు పొగరెక్కుతోందా?" అని సకిలించారు "ధన్యోస్మి - మీరు పాట ఆపారు. అంతేచాలు;" అని నమస్కారం చేశాను.

దాసరి తప్పులు దండంతో సరి

దూరంగా నల్లటి ఇసుకమధ్య యమునా నదీ ప్రవాహంలో పెద్ద పెద్ద తాబేళ్ళను చూస్తూ ఆవలి గట్టున మరో తాజ్‌మహల్ షాజహాన్ ఎందుకు కట్టలేదా అని అనుకుంటూ అలా అలా నిలబడిపోయాను.

మరో తాజ్‌మహల్
మరో ఊర్వశి
మరో నాయుడుగారు
మరో సైగాల్
మరోకృష్ణశాస్త్రి. ఇవి సంభవమా?
ఐడోంట్నో....

# వంటచేయని రాత్రి

ఆడదాని బ్రతుకు -

సొట్టబిందెలు, చిల్లులబాల్చీలు, తిన్నకంచాలు ఎంగిలి గ్లాసులు, అంట గిన్నెలు, వెలిసిపోయినచొక్కాలు, మాసినబట్టలు, నల్లులమంచాలు, ఉచ్చలుపోసిన పరుపులు, సిమెంటు బస్తాల్లా గడ్డ కట్టిన దిళ్ళు, మరకల దుప్పట్లు, చేతులు విరిగిన కుర్చీలు, చీవిడిముక్కు పిల్లలు, అద్దం పగిలిన ఫోటోలు, అట్టలూడిన పుస్తకాలు, చెడు తిరుగుళ్ళు తిరిగి ఇంటికి వచ్చిన నవలలు, కథలు, పాత పత్రికలు, గోడమీద గాలికెగిరే నిరుటి క్యాలండర్లు, అలారమూ టైమూ రెండూ చూపించని అలారం టైము పీసు, కిటారి తలుపులు కిటకిట తలుపులు మొండి గడియలు,